# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

FEBRUARY - 2002

# సంక్షిప్త వార్తలు

2001 డిశంబరు 25 నుండి 2002 జనవరి 3వ తేదీవరకు న్యూఢిల్లీ నుండి వచ్చిన సోదరులు ఫ్రెన్సిస్ డేవిడ్ గారి కుమారులు కాకినాడలో యుండి అక్కడ జరుగుచున్న సువార్తపనిలో పాల్గొనిరి. వినయ్, విపుల్, విషాల్ డేవిడ్‌గార్లు యువకులే అయినను సువార్తపనిలో గొప్ప ఆసక్తి గలవారు. డిశంబరు 30వ తేదీ ఆదివారం ఉదయం బైబిలు తరగతిలో విపుల్ డేవిడ్ గారును, 31వ తేదీ రాత్రి జరిగిన కూటములో వినయ్ డేవిడ్ గారును చక్కటి వాక్యపరిచర్య చేసిరి. వారి ఆంగ్లోప న్యాసమును సామ్యూల్ రోనీ గూటం గారు చక్కగా తెలుగున కనువదించిరి.

2002 జనవరి 10వ తేదీనాడు జాషువా గూటం గారి రెండవ కుమారుడు సామ్యూల్ రోనీ గారు అమెరికాలో M.S. Chemical Engineering చేయుటకు పయనమై వెళ్లిరి. 11వ తేదీ సాయంకాలానికి ఆయన టెక్సాస్‌లో డల్లాస్ పట్టణమునకు క్షేమముగా చేరుకొనిరి. ఇప్పుడాయన లూజియాన యూనివర్సిటీలో ఉన్నతవిద్య నభ్యసించు చున్నారు.

2002 జనవరి 12,13,14వ తేదీలలో అనకాపల్లి గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో అనకాపల్లి క్రీస్తు సంఘము సువార్త కూటములను ఏర్పాటు చేసిరి. ఆ కూటములలో సోదరులు పి.యస్.ఆర్. జయపాల్ (ర్యాలి), ఎ.వినయానంద్, బ్రదర్. ప్రకాశ్, రాజారావ్, రెడ్డి, జాషువా గూటం గార్లు వాక్యోపదేశము గావించిరి. ఆ మూడు దినములు అనేకమంది హాజరై గొప్ప సహవాసములో పాల్గొందిరి. అనకాపల్లి, తుమ్మపాల పరిసర ప్రాంతములలో సోదరులు వినయానంద్ గారు సువార్త వ్యాప్తికొరకు గొప్ప కృషి చేయుచున్నారు.

2002 జనవరి 17వ తేదీ గురువారం సామర్లకోట మండలం గూడపర్తి గ్రామములో యున్న స్థానిక సంఘము ఏర్పాటు చేసిన కూటములో సోదరులు జాషువా గూటం వాక్యపరిచర్య చేసిరి. ఆ స్థానిక సంఘములో బేసిక్ బైబిలు కోర్సు పూర్తి చేసిన 29 మందికి జాషువా గారు సర్టిఫికెట్లు, బైబిళ్లు బహూకరించిరి. గూడపర్తిలో సోదరులు యన్. సేమ్సన్ గారు కష్టించి సువార్త చాటుచు మంచి సంఘమును నిర్మించి యున్నారు. పరిసర గ్రామములలో ఆసక్తితో ఆయన సత్యవాక్యమును చాటుచున్నారు.

᪅

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 ఫిబ్రవరి 2002 సంచిక 7

# యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 3

(Jesus Christ, the son of God - 3)

యేసు ప్రభువు దేవుని కుమారుడు, దేవుడు అను అంశమును గత రెండు సంచికలలో కొంతమట్టుకు తెలిసికొని యున్నాము. "యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రియందు ఆయన యొద్దకు వచ్చి - బోధకుడా నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము, దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3:1-2). యేసు యొక్క శిష్యుడైన "సీమోను పేతురు - ప్రభువా

యెవని యొద్దకు వెళ్లుదుము ? నీవే నిత్య జీవపు మాటలు గలవాడవు; నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:69).

## సాటిలేని రక్షకుడు

యేసు ప్రభువు ఒకప్పుడు సమరయ మార్గమున వెళ్లవలసి వచ్చెను. ఆయన సుఖారను ఒక ఊరికి వచ్చి ప్రయాణము వలన అలసియున్న రీతిగనే అక్కడ యాకోబు బావి యొద్ద కూర్చుండెను. సమరయ స్త్రీ ఒకతె నీళ్లు చేదుకొనుటకు అక్కడికి రాగా ఆయన ఆమెతో ఆత్మీయ సంగతులను గూర్చి సంభాషించెను. ఆయన ఆమె జీవిత చరిత్రనంతటిని ఎరిగియుండెను. దేవుని గూర్చి సత్యారాధనను గూర్చి ఆయన ఆమెకు వివరించెను. ఆ స్త్రీ తనకుండ విడిచిపెట్టి ఊరిలోనికి వెళ్లి మీరు వచ్చి నేను చేసిన వన్నియు నాతో చెప్పిన మనుష్యుని చూడుడి; ఈయన క్రీస్తు కాడా అని ఆ ఊరివారితో చెప్పగా వారు ఆ ఊరిలో నుండి బయలుదేరి ఆయన యొద్దకు వచ్చి, తమ యొద్ద ఉండుమని ఆయనను వేడుకొనిరి గనుక ఆయన అక్కడ రెండు దినములుండెను. ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులునమ్మి, ఆ స్త్రీని చూచి - ఇక మీదట నీవు చెప్పిన మాటను బట్టికాక, మా మట్టుకు మేము విని, యీయన నిజముగా లోకరక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి (యోహాను 4:1-42).

మత్తయి సువార్త 5,6,7 అధ్యాయాల్లో యేసు ప్రభువు కొండమీద చేసిన ప్రసంగ సారాంశమున్నది. బహుజన సమూహములు ఆయన చెప్పుచున్న అనేక ఆత్మీయ సంగతులను నిద్రాహారములు మాని వినిరి. యేసు ఆ ప్రసంగములోని "మాటలను చెప్పి ముగించినప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె గాక అధికారము గల వానివలె వారికి బోధించెను" (మత్తయి 7: 28-29).

ఒకప్పుడు యూదుల ప్రధాన యాజకులును పరిసయ్యులును యేసును పట్టుకొనవలెనని బంట్రౌతులను పంపిరి. గాని వారాయనను పట్టుకొనకుండ తిరిగివెళ్లిరి. "ఆ బంట్రౌతులు ప్రధాన యాజకుల యొద్దకును పరిసయ్యుల యొద్దకును వచ్చినప్పుడు వారు ఎందుకు మీరాయనను తీసికొనిరాలేదని అడుగగా ఆ బంట్రౌతులు, ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదనిరి" (యోహాను 7: 45-46).

ఇప్పటి వరకు యేసు యొక్క బోధలను విన్నవారిలో 5గురి ప్రతిస్పందనను మనము గమనించాము. పరిసయ్యుడగు నీకొదేము "నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదు" మన్నాడు. సమరయ స్త్రీ "ఈయన క్రీస్తుకాడా ?" యని ప్రశ్నించింది. సమరయ పట్టణస్థులు సయితము తమ మట్టుకు తాము విని "నిజముగా ఈయన లోకరక్షకుడని" తెలిసికొను చున్నామనిరి. యేసు యొక్క గొప్ప ప్రసంగమును వినిన జన సమూహములు అధికారయుక్తమైన ఆయన బోధకు ఆశ్చర్యపడిరి. చివరకు ఆయనను బంధించుటకు వెళ్లిన బంట్రౌతులు సయితము ఆయన బోధచే బంధింపబడి, వట్టిచేతులతో తిరిగి వెళ్లి "ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదని" సాక్ష్యమిచ్చిరి. దీనంతటి సారాంశమేమిటి ? యేసు చేసిన బోధలే ఆయన దేవుడని దైవసమానడని, దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చుచున్నవి.

## అసామాన్యమైన బోధకుడు

యేసు ప్రభువు చేసిన బోధలెట్లున్నవి ? మునుపెన్నడు ఏ మానవుడు చెప్పని సంగతులను ఆయన బోధించెను. విద్యావంతులు, విద్యాహీనులు, ధనికులు, ధనహీనులు, సామాన్యులు సయితము అర్థము చేసికొనే రీతిగ ఆయన బోధించెను. మానవుని అంతర్యము నెరిగినవానివలె ఆయన బోధించెను. ఆయన దేవుని కుమారుడు గనుక మానవుని గూర్చిన

సమస్తమును ఎరిగియుండెను. "యేసు అందరిని ఎరిగినవాడు... ఆయన మనుష్యుని అంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు" (యోహాను 2:24-25).

యేసు ప్రభువు జన సమూహముల నుద్దేశించి కొండ మీదనుండి చేసిన ప్రసంగము రెండువేల సంవత్సరముల పాతదైనను, నేటికిని క్రొత్తగనే యుంటాది. అది ఆయన రాజ్యమైన సంఘము యొక్క రాజ్యాంగము. ఆయన బోధను ఇప్పుడు విందాము : "ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు, సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించు కొందురు; నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తి పరచబడుదురు. కనికరము గల వారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయ శుద్ధి గల వారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. సమాధాన పరచువారు ధన్యులు వారు దేవుని కుమారులనబడుదురు, నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది...

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును ? అది బయట పారవేయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు. మీరు లోకమునకు వెలుగై యున్నారు; కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రిందపెట్టరు కాని అది యింటనుండు వారందరికీ వెలుగిచ్చుటకై దీప స్థంభముమీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:1-16).

యేసు ప్రభువు చేసినట్టి గొప్పనైతిక ఆధ్యాత్మిక బోధలను మునుపెన్నడు

ఎవరు చేసియుండలేదు. "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము" మీ పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి" యని ఆయన బోధించెను (మత్తయి 5:43-44). మరియు "మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో అలాగుననే మీరును వారికి చేయుడి" యని ఆయన బోధించెను (మత్తయి 7:12). యేసు ప్రభువు బోధలను ప్రతి వారు పాటిస్తే ఈ లోకంలో సమస్యలు యేమీ వుండవు. గృహంలో, సమాజంలో, దేశదేశాల మధ్య శాంతి సమాధానములు నెలకొల్పబడి యుండును.

## అధికారము గలవాడు

యేసుప్రభువు బోధించినప్పుడు అధికారము గలవానివలె బోధించెను. "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచ వద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేనురాలేదు" అని ఆయన బోధించెను (మత్తయి 5:17). ధర్మశాస్త్రమును నెరవేర్చుట ద్వారా దానిని ఆయన ఎత్తివేసెను. దానికంటె శ్రేష్ఠమైన క్రొత్త నిబంధన నిచ్చెను. ధర్మశాస్త్రము నరహత్య చేయవద్దని చెప్పింది. "నరహత్య చేయవద్దని చెప్పబడిన మాటమీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును; తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" (మత్తయి 5: 21-23). ధర్మశాస్త్ర ప్రకారము ఒకడు హత్యచేస్తేనే అపరాధియగును, గాని క్రీస్తు నియమము ప్రకారము తన సహోదరుని ద్వేషించువాడు, దూషించువాడు అంతే అపరాధియగును, నరకాగ్నికి లోనగును. అట్లే వ్యభిచరించవద్దని ధర్మశాస్త్రం చెప్పింది. అయితే యేసు దాన్ని ప్రక్కన బెట్టి "నేను మీతో చెప్పునదేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు వ్యభిచారము చేసిన వాడగునని" ఆయన బోధించెను (మత్తయి 5: 27-28).

మోషే ధర్మశాస్త్ర ప్రకారము ఒకడు వ్యభిచరిస్తేనే అపరాధి గాని క్రీస్తు నియమము ప్రకారము ఒక స్త్రీని మోహపు చూపుతో చూస్తేనే అపరాధి. యేది శ్రేష్టమైనది ? నిశ్చయముగా క్రీస్తు యొక్క క్రొత్తనిబంధనే గదా ? దేవుడు తప్ప మరెవడు పాతనిబంధన స్థానంలో క్రొత్తనిబంధన నీయుగలడు ? ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశముండనేరదు (హెబ్రీ 8:7). "ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" యని హెబ్రీపత్రిక లేఖకుడు చెప్పుచున్నాడు (హెబ్రీ 8:13).

## పరలోక సంగతుల నెరిగినవాడు

యేసుప్రభువు పరలోక సంగతులను స్వయంగా ఎరిగినవాడు గనుక మానవులు వాటిని అర్ధము చేసికొనేలాగున సులువుగా వారికి ఉపమానముల రీత్యా బోధించెను. పరలోకమునుండి వచ్చినవాడు గనుక అక్కడి సంగతులను చూచి వచ్చినవానివలె ఆయన బోధించెను. "మీ హృదయములను కలవర పడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచు చున్నారు, నా యందును విశ్వాసముంచుడి, నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేని యెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదునని" ఆయన బోధించెను (యోహాను 14: 1-3). పరలోకమును గూర్చి, నిత్యనరకమును గూర్చి ఎరిగి యున్న వాడు గనుక ఆయన వాటిని గూర్చి మానవులకుపదేశించెను.

మానవులు పరలోకం చేరుకోవాలంటే, తండ్రియొద్దకు చేరుకోవాలంటే యేసు క్రీస్తు ద్వారానే చేరుకోవాలి. వేరే మార్గములేనేలేదు. "యేసు - నేనే మార్గమును, సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు

రాడు" అని బోధించెను. చివరకు అంత్యదినమున మనకు తీర్పుతీర్చువాడు కూడా యేసుప్రభువే. "నన్ను నిరాకరించి నామాటలను అంగీకరింపని వానికి తీర్పుతీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్య దినమున వానికి తీర్పుతీర్చును" అని ఆయన చెప్పెను (యోహాను 12:48).

యేసు ప్రభువు చేసిన బోధలే ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. ఇప్పుడు మనం ఆయన వాక్యమునంగీకరించి లోబడిన యెడల, మనం పరలోకంలో నిత్యము ప్రభువుతోను, ఆయన దూతలతోను ఉండగలము.

❋❋❋❋❋

# దేవుడు పక్షపాతి !

## (God is a Respector of Persons !)

నేనొక కూటములో యుండగా దిగువ ప్రశ్న నాకు పంపబడింది. "మీరు ఒకరాత్రి మీటింగ్‌లో అపొ.కా. 10:34 చదివి దేవుడు పక్షపాతి కాదన్నారు. మరొక రాత్రేమో క్రీస్తు సంఘస్థులు మాత్రమే రక్షింపబడిన వారన్నారు. వారే రక్షింపబడగలవారన్నారు. దేవుడు క్రీస్తు సంఘస్థులను మాత్రమే రక్షిస్తే ఆయన పక్షపాతికాడా ?". ఈ ప్రశ్న వేసిన సభ్యులకు కృతజ్ఞత చెప్పి మరునాడు "దేవుడు పక్షపాతి" యనే అంశముపై మాట్లాడుదునని వారికి ప్రకటించాను.

అపొ.కా. 10:34లో పేతురు, "దేవుడు నిజముగా పక్షపాతికాడని గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించుననని" చెప్పెను. నిస్సందేహముగా దేవుడు పక్షపాతి

కాడని అపొస్తలుడైన పేతురు ఇక్కడ బోధించెను. అతడు మొట్టమొదటిగా అన్యజనులకు ఇక్కడ సువార్త బోధిస్తూ, దేవుడు యూదులకు అన్యజనులకు మధ్య వ్యత్యాస మేమీ చూపడుగాని ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఎవనినైనను ఆయన అంగీకరించునని చెప్పెను. అందువలన ఒక వ్యక్తి యూదుడో అన్యుడో, ధనికుడో బీదవాడో, స్వతంత్రుడో దాసుడో, స్త్రీయో పురుషుడో అను వ్యత్యాసాన్ని దేవుడు చూపడు (గలతీ 3:26-29), గాని ఎవడు ఆయనకు భయపడి ఆయన మాటల చొప్పున నడుచుకొనునో వానిని ఆయన లక్ష్యపెట్టును !

"నీ ఆజ్ఞలన్నియు న్యాయములు. నీ వాక్యమును గూర్చి నా నాలుక పాడును" అని దావీదు చెప్పెను (దా. కీర్తన 119:172). సమూయేలు రాజైన సౌలుతో, "నీ దేవుడైన యెహోవా నీకిచ్చిన ఆజ్ఞను గైకొనక నీవు అవివేకపు పని చేసితివి. నీ రాజ్యమును ఇశ్రాయేలీయుల మీద సదాకాలము స్థిరపరచుటకు యెహోవా తలంచియుండెను. అయితే నీ రాజ్యము నిలువదు" అని చెప్పెను (1 సమూ 13:13). "జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదాని పలుక కుండ తన నాలుకను, కపటపుమాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొన వలెను. అతడు కీడు నుండి తొలగి మేలు చేయవలెను, సమాధా నమును వెదకి దాని వెంటాడవలెను. ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయు వారికి విరోధముగా ఉన్నది" యని పేతురు చెప్పెను (1 పేతురు 3:10-2).

గనుక ప్రభువు కొందరిని లక్ష్యపెట్టును, కొందరిని అలక్ష్యపెట్టును. ఆయన కన్నులు, చెవులు నీతిమంతుల వైపునసున్నవి. గాని కీడు చేయువారికి ఆయన ముఖము విరోధముగా నున్నది. ఆయన తనకు విధేయులైన వారందరికీ నిత్యరక్షణకు కారకుడాయెనని పౌలు చెప్పాడు (హెబ్రీ 5:10). ఆయనకు విధేయులు కాని వారికి ఆయన రక్షకుడుకాదు. ఇంకో మాటలో ఆయనకు విధేయులు కాని వారిని ఆయన రక్షించడు, ఈ రీతిగా ఆయన పక్షపాతం

వహించును ! "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:32). "ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమో 2:4).

అందువలన ఒకడు రక్షింపబడవలెనంటే అతడు సత్యమును ముందుగా తెలిసికొనుట అవసరం, గాని కొందరు సత్యమును తెలిసికొనుటకు నిరాకరిస్తారు. యేసు స్వయంగా వారికి బోధించుచున్న దినాల్లో కొందరు తమ కండ్లను చెవులను మూసికొన్నారు (మత్తయి 13:15). గనుక సత్యమును విని విశ్వసించి దానికి లోబడిన వారిని దేవుడు అంగీకరిస్తారు. అట్లు చేయని వారిని తిరస్కరిస్తారు.

రోమీయులకు వ్రాసిన పత్రికలో పౌలు ఇట్లు చెప్పాడు: "ఆయన ప్రతివానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును (రోమా 2:6-7). నిజ క్రైస్తవునికి నిత్యజీవ బహుమానము లభించును. అయితే దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు శ్రమయు వేదనయు కలుగును (రోమా 2:9).

ఈ లేఖనములన్నిటిని బట్టి దేవుడు కొందరిని లక్ష్యపెట్టును, కొందరిని అలక్ష్యపెట్టునని గ్రహించాము. ఆయనకు భయపడి నీతిననుసరించి నడుచు కొనువానిని ఆయన లక్ష్యపెట్టును, రక్షించును. ఆయన సువార్తకు లోబడిన వారిని రక్షించును, సువార్తకులోబడిన వారు క్రైస్తవులవుతారు, క్రీస్తు సంఘ మవుతారు. సంఘమనగా రక్షింపబడిన వారే, రక్షింపబడిన వారందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చుకొంటాడు (అపొ.కా. 2:47). అందువలన ప్రభువు

తన సంఘసభ్యుల యెడల పక్షపాతము చూపుతారు. ఏలయనగా ఆయన వారిని రక్షిస్తాడు; తన సంఘమందు లేనివారిని నిరాకరిస్తారు.

అయితే నిజానికి దేవుడు పక్షపాతికాడు. ఆయన వ్యక్తుల యెడల కాదు గాని వారి వ్యక్తిత్వము యెడల మొగ్గుచూపుతాడు. ఏలయనగా ప్రతివాడు తన ప్రవర్తనకు (వ్యక్తిత్వానికి) తానే బాధ్యుడు. కొందరు క్రైస్తవ ప్రవర్తన కలిగి యుంటారు, కొందరుండరు. ఏలయనగా కొందరు క్రీస్తు సువార్తకు లోబడి యుంటారు, మిగతా వారు లోబడియుండరు. ఒకని కులాన్ని బట్టి, ధనాన్ని బట్టి, విద్యను బట్టి దేవుడు పక్షపాతి కాడు, గాని ఎవడైతే ఆయనకు భయపడి, నీతిగా నడుచుకొనునో అట్టివానిని తప్పక ఆయన రక్షిస్తాడు.

-- జాన్ హేంస్.

*****

# మన శత్రువుల సంగతి యేమి చేయాలి ?

## (How Do we Deal with our Enemies ?)

అందరికీ శత్రువులుంటారు. యేసుక్రీస్తు పాపము లేకుండా జీవించినను ఆయనకు కూడా శత్రువులుండిరి. చివరకు వారాయనను సిలువ వేసి చంపారు. ఆయనకున్న శత్రువులు శత్రువులేకాదు, వారు మతసంబంధమైన శత్రువులు. యేసు నీతిమంతుడు గనుక వారాయనను ద్వేషించారు. దేవునికి అంగీకారముగ యుండాలంటే అందరు నీతి గలిగి యుండాలని ఆయన బోధించారు. గనుక వారాయనను ద్వేషించారు. నిజానికి రోమీయులు ఆయనను సిలువవేసినా, ఆయన శత్రువులైన నాటి మతసంబంధ గురువులే ఆయనను సిలువ వేయించారు.

మనకు కూడా శత్రువులున్నారు. క్రీస్తు సంఘసభ్యులమైన దేవుని కుటుంబమై యున్న మనచుట్టు శత్రువులున్నారు. క్రైస్తవ జీవితాన్ని జీవిస్తు పరలోకం వెళ్లడానికి మనం ప్రయత్నించుచు యుంటే, మనలను ద్వేషించేవారు, తప్పుపట్టేవారు, వ్యతిరేకించేవారు లేకపోలేదు. మనలను ప్రభువు దగ్గర నుండి తొలగించడానికి అనేక శోధనలతో ఈ లోకం నిండి యున్నది. మనం క్రీస్తును వెంబడించుచున్నందున ఆయా మతసంస్థలు, నాయకులు మనలను వ్యతిరేకించుచున్నారు. సాతానుడు, అతని అనుచరులు నిరంతరం మనలను వ్యతిరేకించుచునే యుంటారు.

## శత్రువును ప్రేమించాలి

గనుక మన శత్రువుల సంగతి యేమి చేయాలి ? మన శత్రువులను ప్రేమించి వారికి మేలు చేయాలని క్రీస్తు చెప్పారు. ఆయన ఇట్లు చెప్పారు : "నీ పొరుగువాని ప్రేమించి నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; నేను మీతో చెప్పున దేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థించుడి" (మత్తయి 5:44,45).

అయితే మనలను నిందించి, హింసించు మన శత్రువులను ఎట్లు ప్రేమించగలము ? మానవ లక్షణములను బట్టి అది అసంభవము. అయితే మనం దైవత్వంలో పాలుపంచుకొనుచు ఎదగాలని 2 పేతురు 1:4లో హెచ్చరింపబడియున్నది. "ఆ మహిమ గుణాతిశయములను బట్టి ఆయన మనకు అమూల్యములును అత్యధికములునైన వాగ్దానముల ననుగ్రహించి యున్నాడు. దురాశను అనుసరించుట వలన లోకమందున్న భ్రష్టత్వమును ఈ వాగ్దాన మూలముగా మీరు తప్పించుకొని దేవ స్వభావమందు పాలి వారగునట్లు వాటిని అనుగ్రహించెను".

గనుక మనము దేవుని ప్రేమను (Agape) కలిగియుండాలి. అయితే అదెట్టి ప్రేమ ? ఎదుటివాడు మన శత్రువైనను అతని మేలును కోరుచు ప్రేమించునట్టి ప్రేమ అది. అట్టి దైవప్రేమయున్నప్పుడు కీడుకు ప్రతి కీడు చేయక మేలు చేయుటకు ప్రోద్బలము లభించును. నీ ప్రతివాది నశించుటకు కాదుగాని రక్షింపబడుటకు నీవు కాంక్షించుదువు. అతనికి సహాయపడి మార్పు నొందునట్లు నీవు ప్రయత్నించుదువు. ప్రభువు మన కొరకు తన ప్రాణమును పెట్టినప్పుడు ఆయనకున్న ప్రేమయిట్టిదే. మనం దేవుని నుండి వేరుపడి ఆయనకు శత్రువులుగా యుండగా, ఆయన మనకొరకు తన ప్రాణమునర్పించెను. అట్టి ప్రేమ కరుణ కటాక్షములకు మనం పాత్రులముకాము. అయినను ఆయన మనలను ప్రేమించెను. ఆయన సంఘములో సోదరు సోదరీలగయుంటూ మనం నశించుచున్న మన శత్రువుల కొరకు అట్టి ప్రేమను కలిగియుండాలి.

## పగ తీర్చుకొనుట మన పనికాదు

మనకు కీడు, ద్రోహము చేయువారిని శిక్షించే హక్కు దేవుడు మనకీయలేదు. నైతిక చట్టములను అమలుపరచి తీర్పునిచ్చే అధికారం ఆయన మనకీయలేదు. పగతీర్చుకొనుట మన పనికాదు. దానిని మనం మన ప్రభుత్వానికి, చివరకు దేవునికీ వదిలేయాలి.

దుర్మార్గులైన ఉగ్రవాదుల వలన 2001 సెప్టెంబరు 11వ తేదీనాడు అమెరికాలో న్యూయార్కు పట్టణంలో ఆరువేల మందికిపైగా హతాన్మరణము నొందారు. అమాయకులైన పురుషులు, స్త్రీలు, పిల్లలు ఆనాడు చనిపోయారు. మరియు పలువిధాలుగా ప్రపంచమంతా బాధననుభవించుచున్నది. ఉగ్రవాదుల చర్యలో మన ప్రియులు మరణించడంతో, వారిపై వ్యక్తిగతంగా మనమే పగతీర్చుకోవాలనిపించవచ్చు. గాని అది వ్యక్తుల యొక్క బాధ్యతకాదు. క్రైస్తవులది అంతకుముందేకాదు. వ్యక్తిగత క్రైస్తవులకు పౌలు ఇట్లు చెప్పాడు : "కీడుకు

ప్రతికీడు ఎవనికిని చేయవద్దు. మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి. శక్యమైతే మీచేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా మీకు మీరే పగతీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగతీర్చుట నా పని, నేనే ప్రతి ఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి నీ శత్రువు ఆకలిగొని యుంటే భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుట వలన అతని తలమీద నిప్పులు కుప్పలుగా పోయుదువు. కీడు వలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము" (రోమా 12:17-21).

## ప్రభుత్వ బాధ్యత

వ్యక్తులకును ప్రభుత్వములకును మధ్య గొప్ప వ్యత్యాసమున్నది. "మీ శత్రువులను ప్రేమించుడి" యని ఒకరికిని "దుష్టులకు ప్రతిదండన చేయుడి -- ప్రజలను శిక్షించుడి" యని ప్రభుత్వములకును ఆయన సెలవిచ్చుచున్నాడు (1 పేతురు 2:13-14). అందువలన దుర్మార్గులకు ప్రతిదండన, సన్మార్గులకు మెప్పు కలుగజేయుటకు ప్రభుత్వములు దేవుని వలన కలుగజేయబడినవి. బైబిలు ఇట్లు చెప్పుచున్నది : "ప్రతివాడు పై అధికారులకు లోబడి యుండవలెను, ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడి యున్నవి. కాబట్టి అధికారము నెదిరించువాడు దేవుని నియమము నెదిరించుచున్నాడు; ఎదిరించు వారు తమమీదికి తామే శిక్ష తెచ్చుకొందురు. ప్రభుత్వము చేయువారు చెడ్డ కార్యములకే గాని మంచి కార్యములకు భయంకరులకారు; నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు. వారికి భయపడక యుండ గోరితివా, మేలుచేయుము. అప్పుడు వారిచేత మెప్పుపొందుదువు. నీవు చెడ్డది చేసిన యెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు; కీడు చేయువాని మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతికారము చేయు దేవుని పరిచారకులు" (రోమా 13:1-4).

# అసలైన తీర్పు

అంత్యదినమందు దేవుడే అందరికి తీర్పుతీర్చును. ఆ దృశ్యాన్ని భక్తుడైన యోహాను ఇట్లు వ్రాసాడు; "మరియు గొప్ప వారేమి కొద్ది వారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియలచొప్పున మృతులు తీర్పుపొందిరి...ఎవనిపేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కన బడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రక 21:12-15).

-- జె.సి. ఛోట్.

❋❋❋❋❋

# దేవుని వాక్యము

## దేవుని వాక్యము అగ్నివంటిది :

"కావున సైన్యములకు అధిపతియు దేవుడునగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు - వారు ఈ మాటలు పలికినందున నా వాక్యములు వారిని దహించునట్లు నీనోట వాటిని అగ్నిగాను ఈ జనమును కట్టెలు గాను నేనుచేసెదను; ఇదే యెహోవా వాక్కు" (యిర్మియా 5:14). "ఆయన పేరు నేనెత్తను, ఆయన నామమును బట్టి ప్రకటింపను, అని నేనుకొంటినా ? అది నా హృదయములో అగ్నివలె మండుచు నా యెముకలలోనే మూయబడి యున్నట్లున్నది; నేను ఓర్చి యోర్చి విసికియున్నాను; చెప్పక మానలేను" (యిర్మియా 20:9).

**దేవుని వాక్యము సుత్తెవంటిది :**

నా మాట అగ్నివంటిది కాదా ? బండను బద్దలు చేయు సుత్తెవంటిది కాదా ? (యిర్మియా 23:29).

**దేవుని వాక్యము ఖడ్గము వంటిది :**

మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి (ఎఫెసీ 6:17).

**దేవుని వాక్యము అద్దము వంటిది :**

ఎవడైనను వాక్యమును వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు (యాకోబు 1:23).

**దేవుని వాక్యము విత్తనము వంటిది :**

ఈ ఉపమానభావమేమనగా, విత్తనము దేవుని వాక్యము (లూకా 8:11).

**దేవుని వాక్యము మంచువలె చల్లనిది :**

నా ఉపదేశము వానవలె కురియును నా వాక్యము మంచువలెను లేత గడ్డిమీదపడు చినుకులవలెను పచ్చికమీద కురియు వర్షము వలెను ఉండును (ద్వితీ 32:2).

**దేవుని వాక్యము పాలవంటిది :**

క్రొత్తగా జన్మించిన శిశువులను పోలిన వారై, నిర్మలమైన వాక్యమను

పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి (1 పేతురు 2:3).

## దేవుని వాక్యము ఆత్మయు, జీవము వంటిది :

ఆత్మయే జీవింపచేయుచున్నది, శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునైయున్నవి (యోహాను 6:63).

## దేవుని వాక్యము తేనెవంటిది :

నీ వాక్యములు నా జిహ్వకు ఎంతో మధురములు అవి నా నోటికి తేనెకంటె తీపిగా నున్నవి (కీర్తన 119:103).

## దేవుని వాక్యము దీపము వంటిది :

నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది (కీర్తన 119:105).

నా నోట నుండి వచ్చు వచనము నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైన దానిని నెరవేర్చును (యెషయా 55:11).

సేకరణ -- మానుకొండ ప్రెడరిక్,
శ్రీకాకుళం.

*****

# ఆశ్చర్యకరమైన మానవ సృష్టి - 1
# (నరుని చర్మము యొక్క పరిమాణము)

మన కనుల దృష్టికి కన్పిస్తున్న ఈ మహావిశ్వమంతటిలో ఆశ్చర్యకరమైన అద్భుతమైన మానవ సృష్టి చాలా ఉన్నతమైనది. అందువలన నరునికి సాటి నరులే అనుటలో సందేహం శూన్యం. సృష్టి అంతటికి దేవుని పోలికలు లేవు. అయితే మనుష్యులు దేవుని పోలికయు స్వరూపమును కల్గియున్నారు. దేవదూతలకంటే కొంచెము తక్కువ వానిగ నిర్మించబడిన మనుష్యుని జ్ఞాపకము చేసుకొనుటకు వాడేపాటి ? వాడు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటి వాడని లేఖనములు చెప్పుచున్నవి (కీర్తనలు 8: ; హెబ్రీ 2:6-7). 6వ దినాన మనుష్యుని చేసిన తర్వాత అది చాలా మంచిదిగ నుండెనని దేవుడు చెప్పెను (ఆ.కా. 1:31).

మానవ చర్మమును గూర్చి ఆలోచించినచో ఆశ్చర్యకరమైన విశేషాలను చూడగలము. ఎట్లనగ 19 మిలియన్ల కణములు, 625 శ్వేదగ్రంధులు, 90 నూనె గ్రంధులు చర్మమును అలంకరించిన అనేక వేల నల్లని వెంట్రుకలు 19 అడుగుల రక్తనాళాములు మరియు 19,000 స్పర్శనిచ్చెడి కణములు మొదలగుని నరుని దేహమందు చూడగలము. మన చర్మము ఎంత సుందరముగనున్నది. అవును మన అవయములు సుందరములై యున్నవని పౌలు పేర్కొనెను (1 కొరింథీ 12:24).

పూర్తిగ ఎదిగిన ఒక మనిష యొక్క చర్మము దేహములో ఒక ముఖ్య అంగముగ పరిగణించబడుచున్నది. దాని బరువు 6 పౌన్లు 20 చదరపు అడుగులను మూయగలదు. మరియు చర్మము చాలా కార్యములు చేయ గలదు. అది ఎక్కువ నీరు శరీరము నుండి పోకుండా శరీరములోనికి రాకుండ

గను సూర్యకిరణాలలో కూడా మునిగియుండగలదు. సూర్యుని వేడిమికి మానవ చర్మము ఎండిపోకుండా యుండుటకు 625 స్వేదగ్రంధులు క్రియచేయుచున్నది.

మరియు మన శరీరపు ఉష్ణోగ్రతను సమముగ ఉంచుటకు సహాయ పడును. క్రిములను మన శరీరములోనికి చొచ్చుకొని పోకుండా అపును. ఇది స్పర్శ జ్ఞానము కల్గి మెదడుకు సందేశాలను పంపుచున్నది. ఏది చల్లదనమో ఏది వేడిమో లేక ఏది నులివెచ్చనిదనమో మెదడుకు చెప్పుచున్నది. కొన్ని సమయాల్లో చక్కలిగింతనిస్తుంది. గాయము ఏర్పడినప్పుడు చర్మము వాస్తుంది.

కొన్ని సమయాల్లో నొప్పికి మేల్కొల్పును. మరికొన్ని సమయాలలో తమాషాగ క్రియ చేయుచున్నది. అదెలాగంటే ఒకవేళ చర్మము పగిలినను తెగినను శరీరము వెంటనే మరమ్మత్తు చేయుటకు త్వరపడును. రక్తకణాలు తెగినచోట (Prothrombin) అనే ఒక కెమికల్ వెనువెంటనే అచ్చోటికి వచ్చి బయటికి వెడలు రక్తమును గడ్డకట్టుటకు క్రియ చేయును. అధిక రక్తధార వృధా కాకుండా అదికాపాడును. మరియు తెగిపోయిన చర్మము అతుక బడుటకు సహకరించును.

మరియు వ్యాధి యొక్క క్రిములను చంపుటకు కావలసిన శక్తి కూడా ఉన్నది. చీమపాదము యొక్క చిన్నవ్రేలును కుట్టిన వెంటనే చర్మము మెదడుకు విషయాన్ని అందించును. మెదడు చేతికి సంజ్ఞలు చేసి చీమను చంపి వేయును. చర్మవ్యాధులు శోకినప్పుడు దాని బాధ తీర్చుకొనుటకు చేతుల సహాయాన్ని కోరును. కొన్ని సందర్భాలలో చర్మము పులకరించును. దేహానికి దిగులు చింత నిరాహారదీక్ష కల్గియున్నప్పుడు తన యొక్క సంపూర్ణకళను కోల్పోవును. చిటపట చినుకులను చర్మము హాయిని పొందగలదు.

ఒకవేళ మనము అధిక ఉష్ణములో ఉన్నట్లయితే స్వేదగ్రంధులలో నుండి

ఒక్క రోజులో $2^{1/2}$ గాలన్ల చెమటనిస్తుంది. చిరుగాలి శరీరమునకు సోకిన యెడల ఆ చెమట ఆరిపోగ శరీరము చల్లబడును. చర్మకణాలు వృద్ధాప్యములో తన శక్తిని కోల్పోవుటను బట్టి చర్మము ముడతలు పడును. ఈ చర్మము ఏదోలాగున ఉద్భవించెనని నాస్తికులు భావన. కాని దేవుడే ఒక శిల్పకారునివలె మానవ దేహముపై చర్మాన్ని పొదిగించెను (యోహెజ్కేలు 37:16; కీర్తనలు 100:3).

ఎక్కువ నీరు శరీరంలోనికి పోకుండా కాపాడును. దేహముపై వ్రాలిన హానికరమైన క్రిములను చంపును. ఉష్ణోగ్రతను సమతలపర్చును. క్రమము తప్పకుండా మెదడునకు సందేశాలను పంపును. నిజమే ఇదొక అద్భుత శరీరమే! దేవా నీవునన్ను కలుగజేసిన విధము చూడగ భయమును ఆశ్చర్యమును పుట్టుచున్నదని దావీదు చెప్పెను (కీర్తనలు 139:13-15).

మానవ శరీరము లోని ప్రతి అవయవము కొన్ని ప్రత్యేకమైన కార్యక్రమములను జరిగించుటకు నిర్మింపబడినది. ఎక్కువ చలిని చర్మము సహించదు. ఇంత ఆశ్చర్యకరమైన దేహం దేవుని వలన అనుగ్రహింపబడిన దాని నిర్మాణకుడు దేవుడే గనుక దేవుని యందు భయభక్తులు కల్గియుండవలెను. మానవకోటికి యిదియే విధి (ప్రసంగి 12:14). కాబట్టి ఈ దేహము ఎల్లప్పుడు దేవుని సన్నిధిలో కన్పించాలి.

— ఓ. ప్రకాశం,
చెన్నై

❋❋❋❋❋

# నోవహు రక్షణ - మన రక్షణ
## (Noah's Salvation and ours)

నోవహు రక్షణ మన రక్షణకు సారూప్యముగా యున్నది. అతడు భౌతికంగా ప్రాణాలతో రక్షింపబడినను, తన కాలము నాటి దుష్ట లోకపు పాపము నుండి కూడ రక్షింపబడెను. ఏలయనగా వారందరు జలప్రళయంలో నశించారు. క్రైస్తవుడు ఆత్మీయంగా మొదట రక్షింపబడినను, క్రైస్తవుడైనవాడు దురలవాట్లను భక్తిహీనతను విసర్జిస్తాడు గనుక శారీరకంగా కూడ మేలు పొందుతాడు.

**నోవహు దేవుని కృపవలన రక్షింపబడెను.**

నరుల చెడుతనము భూమిమీద గొప్పదాయెను. అందువలన భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది, భూమి మీద నుండకుండ వారిని తుడిచి వేయుదుననుకొనెను. "అయితే నోవహు యెహోవా దృష్టి యందు కృప పొందినవాడాయెను" (ఆది.కా. 6:3-8). మనము కూడ దేవుని కృపవలననే రక్షింపబడుదుము. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు" (ఎఫెసీ 2:8).

**నోవహు విశ్వాసము వలన రక్షింపబడెను.**

"విశ్వాసమును బట్టి నోవహు అది వరకు చూడని సంగతులను గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి భయభక్తుల గలవాడై, తన యింటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను" (హెబ్రీ 11:7).

మనము కూడ విశ్వాసము వలన రక్షింపబడుదుము. "కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగి యుందుము" (రోమా 5:1).

## నోవహు విధేయత వలన రక్షింపబడెను.

దేవుడతనికి ఆజ్ఞాపించినది యావత్తు నోవహు చేసెను (ఆది.కా. 6:22). మనము కూడ యేసుప్రభువు నందు విశ్వాసముంచి, ఆయనకు విధేయత చూపితేనే రక్షింపబడుదుము. "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచి యుండును" (యోహాను 3:36; హెబ్రీ 5:8-10; 2 థెస్స 1:7-9 కూడ చదువండి).

## నోవహు నీటి మూలముగా రక్షింపబడెను.

నోవహు నిర్మించిన " ఆ ఓడలో కొందరు అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3:21). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16).

## నోవహు ఓడలో రక్షింపబడెను.

మనం ఆత్మీయ ఓడయైన సంఘములో రక్షింపబడుదుము.

"మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అపొ.కా. 2:47). శరీరమైన సంఘమునకు క్రీస్తే రక్షకుడై యున్నారు (ఎఫెసీ 5:22-27). దానిని ఆయన తన స్వరక్తమిచ్చికొన్నారు (అపొ.కా. 20:28).

## నోవహు ఓడను నిర్మించాడు.

క్రీస్తు సంఘమును నిర్మించారు. నోవహు ఒకే ఒక్క ఓడను నిర్మించాడు. క్రీస్తు కూడా ఒకేఒక్క సంఘమును నిర్మించారు. ఆ ఓడ నోవహు ఓడ, సంఘము క్రీస్తు సంఘము. ఆ ఓడలో ఒకేఒక్క కుటుంబ ముండెను. అది నోవహు కుటుంబము. సంఘములో కూడ ఒకేఒక్క కుటుంబమున్నది. అది దేవుని కుటుంబము. నోవహు కుటుంబమంతయు ఆ ఓడలో యుండెను. దేవుని కుటుంబమంతా క్రీస్తు సంఘములో యుంటాది. క్రీస్తు సంఘములో యున్నవారంతా దేవుని కుటుంబమే. నోవహు పిల్లలే ఓడలో యుండిరి. దేవుని పిల్లలు మాత్రమే క్రీస్తు సంఘములో యుంటారు.

## ఓడలో యున్నవారంతా నోవహు పేరునుబట్టియే పిలువబడిరి.

సంఘములో యున్నవారంతతా క్రీస్తు నామమునే ధరింతురు. ఓడకు వెలుపల యున్న వారంతా దేవునికి అవిధేయులు. క్రీస్తు సంఘమునకు వెలుపల యున్నవారంతా దేవునికి అవిధేయులే. ఓడలో యున్న వారంతా రక్షింపబడిరి. రక్షింపబడినవారంతా క్రీస్తు సంఘములోనే యుందురు. ఏలయనగా రక్షింపబడినవారే క్రీస్తు సంఘము. ఓడకు వెలుపల యున్నవారంతా నశించిరి. సంఘము నకు వెలుపల

యున్న వారంతా నశింతురు. నోవహు, అతని కుటుంబము ఓడలో ప్రవేశించుటకు నిరాకరించినా, దేవుడు చెప్పకముందే దానిలో నుండి బయటకు వచ్చినా, నశించి యుందురు. అట్లే సంఘములో ప్రవేశించుటకు నిరాకరించు వారు, ప్రవేశించిన తరువాత నమ్మకముగా యుండనివారు నశింతురు.

## ఓడలో ప్రవేశించుటకు ఒకేఒక్క ద్వారముండెను.

క్రీస్తు సంఘములో ప్రవేశించే ద్వారము (మార్గము) ఒకేఒక్కటి యున్నది. ఆ మార్గము, ద్వారము యేసుక్రీస్తే (యోహాను 10:9, 14:6). ఓడలో వెలుగు నిచ్చుటకు ఒకేఒక్క కిటికీ యుండెను. సంఘమునకు వెలుగునిచ్చు ఒకేఒక్క స్థావరమున్నది. అదియే బైబిలు, "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది" (కీర్తన 119:105).

"ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంత మందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1 కొరింథీ 10:11). గనుక నోవహు రక్షణకు, మన రక్షణకు ఎంత సారూప్యమున్నదో గమనించారా ?

-- పాల్ సైమన్.

❄❄❄❄❄

# చెన్నై టీచర్ ట్రైనింగ్ స్కూలు

## బైబిలు తర్ఫీదునకు గొప్ప అవకాశము

## విద్యార్థుల ప్రవేశమునకై ఆహ్వానము

ప్రతి సంవత్సరము జూన్, సెప్టెంబరు మరియు జనవరి నెలలలో విద్యార్థులు చేర్చుకొనబడుదురు, విద్యార్థులకు బైబిలులో మంచి శిక్షణతో పాటు "గ్రీకు" భాషను కూడా చివరి సంవత్సరములో నేర్పించబడును.

శిక్షణ కాలము : మూడు సంవత్సరములు (సెమిస్టర్ విధానములో ఉంటుంది)

మాధ్యమం : తెలుగు మరియు తమిళ భాషలలో

అర్హతలు :
1. తెలుగు చదువుట వ్రాయుట తెలిసి ఉండవలెను.
2. క్రీస్తు సంఘసభ్యులై ఉండవలెను.
3. 17 సంవత్సరములకు పైబడి వివాహము కాని పురుషులై యుండవలెను.
4. స్థానిక సంఘ సేవకుని ద్వారా సంప్రదించవలెను.

గమనిక: 1. 3 సంవత్సరముల కోర్సును పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వబడును
2. ఉచిత భోజనము వసతులతో పాటు స్టైఫండ్ ఇవ్వబడును.

పైన తెలిపిన ప్రకారము 3 సంవత్సరముల బైబిలు తర్ఫీదునకై ఆసక్తి గలవారు అడ్మిషన్ ఫారములు పొందుటకై దిగువ చిరునామాకు వ్రాయండి:

వివరములకు :- డైరెక్టర్,
చెన్నై ట్రైనింగ్ స్కూలు,
7/35, లాక్ స్ట్రీట్, కోటూర్,
చెన్నై - 600 085.
ఫోన్ : 044 - 4472895.

2002 జనవరి 18వ తేదీ శుక్రవారం కోరుకొండ మండలం గాడాలలో సువార్తికుల సదస్సు జరిగెను. ఆ సదస్సును బిక్కవోలు బైబిలు స్కూలు బృందము తరపున సహోదరులు డేవిడ్ కింగ్ గారు ఏర్పాటు చేసిరి. "నాయకత్వము" అను అంశము ఆ రోజు చర్చించబడెను. సోదరులు ఎస్. జాన్, పి.యస్.ఆర్. జయపాల్, జాషువా గూటం, టి.వి.యన్. కుమార్ గార్లును, అమెరికా నుండి వచ్చిన సోదరులు డేనీరేడర్ మరియు డెన్నిస్ మర్ఫీగార్లును వాక్యోపదేశము గావించిరి. నాయకుడగువాడు సత్యమార్గము నెరుగువలెను, దానిలో నడవవలెను, తదుపరి దానిలో నడిపించ వలెను, మరియు అతడు వినయ విధేయత గలవాడై మంచి మాదిరిని నెలకొల్పు నాయకుడుగా యుండవలెను. సంఘములో నాయకత్వపు స్థానమును బోధకుడుగాక పెద్దలు అలంకరింపవలెను అని సోదరులు బోధించిరి.

2002 జనవరి 20 నుండి 24 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ అధ్వర్యములో 18వ వార్షిక బైబిల్ లెక్చర్‌షిప్ జరిగెను. దానిలో సోదరులు జాన్‌ఫోర్డ్ (అమెరికా), ఫ్రాన్సిస్ డేవిడ్ (న్యూఢిల్లీ), కె. మల్లిక్ (మద్రాసు) యస్. జాన్ (బిక్కవోలు), టి.వి.యన్. కుమార్, టి. నోబుల్ ఆనందరాజు, ఇందుపల్లి ఇశ్రాయేలు (తిరువూరు), పి. చంద్రశేఖర్, జె. డేవిడ్ రాజు గార్లు వాక్యపరిచర్య చేసిరి. 24వ తేదీనాడు పట్టభద్రులైన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ జరిగెను. దానికి ముఖ్య అతిథులుగా కాకినాడ మున్సిపల్ చైర్మన్ డా॥ బి. చంద్రశేఖర్ గారు విచ్చేసిరి.

జనవరి 26వ తేదీ శనివారం రాజమండ్రి మండలం కొంతమూరు స్థానిక సంఘము ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస కూటములో సోదరులు జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి . కొంతమూరు స్థానిక సంఘస్థులు ఆ గ్రామమునకు సమీపముగా యన్న తోటలో కూడుకొని దినమంతయు సహవాసములోను, వాక్యపరిచర్యలోను పాల్గొందిరి. సండే స్కూలు విద్యార్థులకు, యువకులకు బైబిలు సంబంధమైన క్విజ్‌లు ఏర్పాటు చేయబడెను. విజేతలకు బహుమతులు ఇయ్యబడెను. నాటి కార్యక్రమము నంతటిని స్థానిక సువార్తికులు పలివెల అబ్రహామ్ లింకన్ గారు సమర్థ వంతముగా నిర్వహించిరి. కొంతమూరులో జరుగుచున్న సత్య సువార్త పనిని గూర్చి జాషువా గారు స్థానిక సంఘమును, అబ్రహామ్ లింకన్ గారిని అభినందించిరి.

జనవరి 28వ తేదీ నుండి ఫిబ్రవరి మొదటి తేదీ వరకు కాకినాడలో జగన్నాథపురం Church Square లో గల క్రీస్తు సంఘ ఆవరణలో బైబిలు తరగతులు జయకరముగా నిర్వహించబడెను. ఆ తరగతులకు సోదరులు టి.వి.యన్. కుమార్ గారి కుమారుడు టి.జి. సుధీర్ నాయకత్వము వహించి చక్కగా నడిపించిరి. ఆ తరగతులలో అమెరికా నుండి వచ్చిన సోదరులు డేనీ రేడర్, డెన్నిస్ మర్ఫీ గార్లును మరియు టి. జ్ఞానానందం, యస్. జాన్, జాషువా గూటం, టి.వి.యన్. కుమార్ గార్లును వాక్యోపదేశం చేసిరి. అనేకులు హాజరై ఆత్మీయముగా అభివృద్ధి జెందిరి.

Postal Regd. No. VM/KD/02/2002
RNI Regd. No. 69973/98

From:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.